7
సాక్షి సంగారెడ్డి
శుక్రవారం ၊ 19 ၊ జూలై ၊ 2024

రుణమాఫీ చరిత్రాత్మకం


ఎడ్లబండిపై ప్రదర్శనగా వెళ్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఒకేమారు రూ.2 లక్షల రైతు రుణ మాఫీలో భాగంగా రూ.31వేల కోట్లను మాఫీ చేస్తుండటం చరిత్రాత్మకమని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్‌లో గురువారం రుణమాఫీ సంబురాల్లో భాగంగా ఖేడ్ తహసీల్ మైదానం నుంచి రాజీవ్‌చౌక్ వరకు ఎడ్లబండ్లపై రైతులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఖేడ్ నియోజకవర్గంలో రూ. లక్ష లోపు రుణ మాఫీకి రూ.107 కోట్లు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని భ్రష్టుపట్టించిందని విమర్శించారు.

రూ.279.62కోట్ల రుణమాఫీ : కలెక్టర్

సంగారెడ్డి టౌన్ : జిల్లాలో 'రైతు రుణమాఫీ' అమలుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ క్రాంతి తెలిపారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బ్యాంకర్లతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 51,167 మంది రైతులకు రూ.279.62కోట్ల రుణమాఫీ కానుందని చెప్పారు. రుణమాఫీ డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో చేరేలా బ్యాంకర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు వేదికల్లో రైతుల లిస్టు, పంచాయతీలలో బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లిస్టులో రైతుల పేర్లు లేకపోతే టోల్ ఫ్రీ నంబర్ 08455276456లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ట్రైనింగ్ కలెక్టర్ మనోజ్, జిల్లా వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి అధికారి అంబికాసోని పాల్గొన్నారు.

ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది



కల్హేర్ : కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీపై ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. చెప్పినట్లే సీఎం రేవంత్ మొదటి విడతలో రుణమాఫీ చేశారు. రైతులతో కలిసి సంబరాలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంది.
- వడ్ల రమేష్, రాపర్తి, కల్హేర్ మండలం

సంతోషంగా ఉంది



జహీరాబాద్: నాకు ఎస్‌బీఐలో రూ.82వేల అప్పు ఉండే. ఆ మొత్తం మాఫీ అయినట్లు మెసేజ్ వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటా.
- చిన్నమర్రి నర్సింహారెడ్డి, రైతు, పస్తాపూర్

రేపు ఖేడ్ మున్సిపల్ కమిషనర్‌తో సాక్షి ఫోన్‌ఇన్

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల గురించి తెలియజేసేందుకు శనివారం 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, దోమల బెడద తదితర సమస్యల గురించి ఫోన్ ద్వారా కమిషనర్‌కు తెలియజేయవచ్చు.




అంశం: పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, పట్టణ సమస్యలు
మున్సిపాలిటీ : నారాయణఖేడ్
కమిషనర్ : జగ్జీవన్
తేదీ: 20.07.2024 (శనివారం)
సమయం: ఉదయం 10.30గంటల నుంచి 11.30గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్:
9133449496/9949309592

అగ్రస్థానంలో అందోల్

- రాష్ట్రంలోనే అత్యధిక పంట రుణాలు మాఫీ అయిన సెగ్మెంట్ ఇదే
- తర్వాత స్థానం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్
- జిల్లాల వారీగా పరిశీలిస్తే సిద్దిపేటకు రెండో స్థానం..
- సంగారెడ్డి నాలుగో స్థానం..
- తొలివిడత రుణమాఫీ తీరు..
- డాకూర్ రైతులతో సీఎం మాటామంతి


వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎంతో మాట్లాడుతున్న రైతు శివయ్య. చిత్రంలో మంత్రి దామోదర, కలెక్టర్ క్రాంతి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : రైతు రుణమాఫీ ప్రక్రియలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెండు అసెంబ్లీ సెగ్మెంట్లు రాష్ట్రంలోనే మొదటి, రెండో స్థానాల్లో నిలిచాయి. సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం మొదటి స్థానంలో నిలవగా, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ రెండో స్థానాన్ని దక్కించుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రుణ మాఫీ ప్రక్రియలో భాగంగా గురువారం తొలి విడతగా రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసింది. ఇందులో భాగంగా అందోల్ నియోజకవర్గంలో 20,216 మంది రైతులకు సంబంధించి రూ.107.83 కోట్లు మాఫీ అయ్యాయి. ఇక రెండో స్థానంలో నిలిచిన హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించి 18,907 మంది రైతులకు చెందిన రూ.106.74 కోట్లు మాఫీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 10.83 లక్షల మంది రైతులకు సంబంధించి 6,098 కోట్ల పంట రుణాలను మాఫీ చేసింది. ఇందులో మొదటి రెండు స్థానాలు ఉమ్మడి జిల్లా నియోజకవర్గాలే కావడం గమనార్హం.

మాఫీ అయిన విలువ పరంగా పరిశీలిస్తే..

జిల్లాల పరంగా రుణమాఫీ అయిన మొత్తాన్ని పరిశీలిస్తే సిద్దిపేట జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. అత్యధికంగా రూ.290.24 కోట్లు ఈ ఒక్క జిల్లాకు చెందిన పంట రుణాలు మాఫీ అయ్యాయి. సంగారెడ్డి జిల్లా నాలుగో స్థానంలో ఉంది. ఈ జిల్లాలో 279.62 కోట్ల పంట రుణాలు మాఫీ అయ్యాయి. మొదటి స్థానంలో నల్లగొండ జిల్లా ఉంది. ఈ జిల్లాలో అత్యధికంగా రూ.454.49 కోట్లు పంట రుణాలు మాఫీ అయ్యాయి. మూడో స్థానంలో సూర్యాపేట జిల్లాలో రూ.282.98 కోట్ల మేర మాఫీ అయ్యాయి. మెదక్ జిల్లా మాత్రం తొమ్మిది స్థానంలో నిలిచింది.

గ్రామాల వారీగా లబ్ధిదారుల రైతుల జాబితా

మొదటి విడతలో రుణమాఫీ అయిన రైతుల జాబితాను వ్యవసాయశాఖ అధికారులు విడుదల చేశారు. మండలం, వ్యవసాయ క్లస్టర్, గ్రామం, రైతుపేరు, తండ్రి/భర్త పేరు వివరాలతో జాబితాను ప్రకటించారు. అయితే ఈ జాబితాలో రైతుల వారీగా ఎంత మొత్తం మాఫీ అయ్యిందనే వివరాలను పొందుపరచలేదు. అయితే రైతుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వస్తాయని అధికారులు పేర్కొన్నప్పటికీ అవేమీ వచ్చిన దాఖలాలు కనిపించలేదు.

సుమారు 55 శాతం మేరకు రుణ విముక్తులు

తొలి విడతలో ప్రభుత్వం రూ.లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేసింది. అయితే ఆయా బ్యాంకుల్లోని ఒక్కో బ్రాంచ్‌ల్లో రూ.లక్షలోపు పంట రుణాలు పొందిన రైతుల్లో సుమారు 60 శాతం మంది రైతులకు సంబంధించిన రుణాలు మాత్రమే మాఫీ అయినట్లు సమాచారం. వాణిజ్య బ్యాంకులు, ప్రైవేటు రంగ బ్యాంకులు, సహకార బ్యాంకులు.. ఇలా అన్ని బ్యాంకులకు సంబంధించిన బ్రాంచుల్లో రూ.లక్షలోపు పంట రుణం ఉన్న రైతుల్లో సుమారు 40 శాతం నుంచి 60 శాతం మంది రైతులవి మాత్రమే మాఫీ అయ్యాయి.

డాకూర్ రైతులతో సీఎం మాటామంతి..

పంట రుణమాఫీ సంబరాల్లో భాగంగా అందోల్ మండలం డాకూర్ గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామోదర రైతులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి గ్రామానికి చెందిన శివయ్య, లక్ష్మమ్మ అనే రైతులతో మాట్లాడారు.

రైతువేదికలు ముస్తాబు

రుణమాఫీ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతు వేదికలను ముస్తాబు చేశారు. తోరణాలు కట్టారు. ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల ముగ్గులు వేసి సంబరాలు చేశారు. ఆయా క్లస్టర్ల పరిధిలో మాఫీ అయిన రైతులను వేదికల వద్దకు పిలిచి రుణమాఫీ పత్రాలను అందజేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఈ పత్రాలను లబ్ధిదారులైన రైతులకు పంపిణీ చేశారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మీ పెద్దసారుకు నమస్కారం చేయండి

వట్‌పల్లి(అందోల్): వచ్చే నెలలో రుణమాఫీ చేద్దామనుకున్నా..కానీ ఈ నెలల్లోనే రైతులకు రుణ మాఫీ పంపిణీ చేయాలని పట్టుబట్టిందే మీ మంత్రి దామోదర రాజనర్సింహ అని, ముందుగా ఆయనకు దండం పెట్టండని రైతు శివయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడంతో అక్కడ ఉన్న రైతులంతా చప్పట్లతో హర్షధ్వానాలు వ్యక్తపరిచారు. గురువారం లక్ష రూపాయల రుణమాఫీ పథకం నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా డాకూరు గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి, కలెక్టర్ క్రాంతి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. అందోల్‌లో 20వేల మంది రైతు కుటుంబాలకు రూ.107 కోట్ల రుణమాఫీ వచ్చిందన్నారు. రాష్ట్రంలోనే అందోల్ మొదటి స్థానంలో ఉందన్నారు. 13 ఏళ్ల తర్వాత మళ్లీ రైతులకు ఒకేసారి రుణమాఫీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు.

మీ కూతురా సార్..
కార్యక్రమంలో ఓ ఆసక్తికరమైన సంఘటన చోటు చేసుకుంది. మంత్రి పక్కనే కూర్చున్న కలెక్టర్ క్రాంతిని చూపించి.. ఆమె మీ కూతురా సారూ..? అంటూ మహిళలు అడిగారు. మంత్రి నవ్వుతూ ఆమె నా కూతురు కాదు.. కలెక్టరమ్మ అంటూ చెప్పడంతో ఒక్కసారిగా అందరూ నవ్వారు.

ఇచ్చిన హామీ నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌దే..


మద్దికుంట రైతు వేదిక వద్ద రైతుకు స్వీట్ తినిపిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి)/ సంగారెడ్డి టౌన్ /సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రైతు రుణ మాఫీపై ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి అన్నారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో గురువారం కొండాపూర్‌లోని రైతువేదిక వద్ద రైతులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకొని సంబురాలు జరుపుకున్నారు. అదేవిధంగా సదాశివపేట మండల పరిధిలోని మద్దికుంట రైతు వేదికలో నిర్వహించిన రుణమాఫీ సంబరాల్లో పాల్గొన్నారు. మొదటి విడతగా రూ.లక్ష వరకు రుణమాఫీ చేసిన సీఎం రేవంత్ రెడ్డికి రైతుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అలాగే సంగారెడ్డిలోని రైతువేదికలో సీఎం ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు.

న్యూస్‌రీల్

పాపమ్మ తల్లికి అభిషేకం


కలశ పూజ చేస్తున్న వేద పండితులు

మునిపల్లి(అందోల్): మండలంలోని బుదేరా గ్రామంలో నూతనంగా నిర్మించిన పాపమమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. గురువారం అమ్మవారికి అభిషేకం, కలశ పూజ తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు వివిధ ట్రేడ్లకు సంబంధించి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషినిస్ట్, మెకానిక్ మోటార్ వెహికల్, వైర్‌మెన్, డ్రాఫ్‌మెన్, సివిల్, ఎలక్ట్రిక్ మెకానిక్, ఫ్యాషన్ డిజైన్, టెక్నాలజీ, వెల్డర్, మెకానిక్ డీజిల్ ట్రేడ్లలో ప్రవేశాల కొరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 21వ తేదీవరకు http://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆప్షన్ నమోదు చేసుకోవాలన్నారు.

'ఆయిల్ పాం'తో సుస్థిర ఆదాయం


ఆయిల్‌పాం మొక్కలను పరిశీలిస్తున్న డీజీఎం స్వీటి వేగుంట

కల్హేర్(నారాయణఖేడ్): ఆయిల్ పాం సాగు ద్వారా 30ఏళ్ల వరకు స్థిరమైన ఆదాయం పొందవచ్చని గోద్రేజ్ ఆగ్రోవేట్ ఆయిల్ పాం కంపెనీ డీజీఎం స్వీటి వేగుంట తెలిపారు. గురువారం మండలంలోని కృష్ణాపూర్‌లో మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డికి చెందిన ఆయిల్‌పాం సాగును పరిశీలించారు. డివిజన్ ఉద్యాన అధికారి మానికారెడ్డి, గోద్రేజ్ ఆగ్రోవేట్ మేనేజర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, నాయకులు పీరయ్య, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అబ్దుల్ రహీంకు పరామర్శ

నారాయణఖేడ్: నాగిల్‌గిద్ద మండలం ఏస్గి గ్రామానికి చెందిన జాతీయ మానవహక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రహీంతోపాటు అతడి సోదరుడు తయ్యాబ్‌పై బుధవారం రాత్రి కొందరు దాడిచేశారు. గాయపడిన వారు ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, ఖేడ్, నాగల్‌గిద్దా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు తాహెర్ అలీ, మాణిక్ రావుపాటిల్, నాయకులు సాయిలు పటేల్, అవుటి శంకర్ ముదిరాజ్, గౌస్‌చిస్తి, మోహినొద్దీన్, సామాజిక హక్కుల సంఘం నాయకులు పుప్పాల అశోక్ తదితరులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.


అబ్దుల్ రహీంను పరామర్శిస్తున్న నాయకులు

'గ్రూప్ 2' వాయిదా వేయాలని ఆందోళన


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

సంగారెడ్డి టౌన్ : గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేసి పోస్టుల సంఖ్యను పెంచాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ తీరును నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్ మాట్లాడుతూ డీఎస్సీ రాస్తున్న వారిలో గ్రూప్ 2కు దరఖాస్తు చేసుకున్న వారు వందలాదిమంది ఉన్నారని, వారి కోసం పరీక్షను రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో మెగా డీఎస్సీ ప్రకటించాలని, రాబోయే అసెంబ్లీ సమావేశాలలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రవి, ప్రశాంత్, రమేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్.. దుర్మార్గపు కుట్రలు మానుకో


రైతుతో మాట్లాడుతున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: ఇద్దరు రైతుల మధ్య గట్టు పంచాయతీని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గజ్వేల్‌కు చెందిన రైతు కిష్టయ్యను గురువారం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో కలిసి పరామర్శించారు. భూమి పంచాయితీ కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతుకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. తక్షణ సహాయం కింద రూ.లక్ష అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలం దమ్మక్కపల్లికి చెందిన రైతు కిష్టయ్యకు పక్క రైతుతో గట్టు పంచాయితీ కావడంతో పురుగుల మందు తాగాడు. ఈ విషయంలో రాజకీయ లబ్ధి పొందాలని హరీశ్ కుట్ర చేస్తున్నారని మండి పడ్డారు. కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో ఎంతమంది రైతుల ఉసురు పోసుకున్నారో ఇక్కడి ప్రజలకు తెలుసన్నారు. ఆంక్షారెడ్డి, దేవేందర్ రెడ్డి, లింగారావు, రవీందర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి ఉన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి


ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సంగారెడ్డి టౌన్ : ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయడం తోపాటు పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశాలకు కొత్తగా ప్రవేశ పరీక్ష పెట్టే విధానం రద్దు చేయాలని, కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, బీసీజీ సర్వే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, బాబురావు, వరలక్ష్మి, సునీత, రజిత, తుల్జామా, లక్ష్మి పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు సమస్యలు రానీయొద్దు

జోగిపేట(అందోల్): విద్యార్థులకు ఏ సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. గురువారం జోగిపేట మున్సిపల్ పరిధిలోని కేజీబీవీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి సౌకర్యాలు, వసతులు, ఆహారం తదితర అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, చదువుపై ఆరా తీశారు. పాఠశాలలో డ్రైనేజీ, నీటి సమస్య ఉందని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్‌కి తక్షణమే మిషన్ భగీరథ మెయిన్ కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం జోగిపేట ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతున్న కంప్యూటర్ డేటా ఎంట్రీ ప్రక్రియను తనిఖీ చేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ గీత, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసీల్దార్ భాస్కర్ కుమార్, ఎంపీడీవో రాజేష్ కుమార్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సారా జ్యోతి ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రమేష్

సంగారెడ్డి టౌన్ : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ లా కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, గృహహింస, వరకట్న నిషేధం తదితర చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం కోసం న్యాయ సేవాధికారి సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తులు సక్రమంగా ఆన్‌లైన్ చేయండి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్


దరఖాస్తుల నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

కంది (సంగారెడ్డి): ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను సక్రమంగా ఆన్‌లైన్ చేయాలని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. గురువారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ సబ్సిడీ కోసం దరఖాస్తులో సరైన వివరాలు నమోదు చేసినా కొందరికి లబ్ధి చేకూరడం లేదని ఎంపీడీఓ శ్రీనివాస్ వివరించారు. ఉచిత విద్యుత్ దరఖాస్తులకు ఆప్షన్ ఉందని, వాటిని త్వరగా సరి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. అంతకు ముందు పాఠశాల విద్యార్థులతో మాట్లాడి యూనిఫాంల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

ఎస్పీ రూపేష్


అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ రిసెప్షన్ వద్ద ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ రూపేష్

పటాన్‌చెరు : అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ రూపేష్ గురువారం సాయంత్రం పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ రికార్డులు, పరిసరాలను తనిఖీ చేశారు. అలాగే 5ఎస్ ఇంప్లిమెంటేషన్ విధానాన్ని పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని సస్పెక్ట్, హిస్టరీ షీటర్‌ల కదలికలను ఎప్పటికప్పుడు చెక్ చేయాలని, యాక్టివ్‌గా ఉన్నవారి కదలికలపై నిఘా పెట్టాలని సీఐ నాగరాజుకు సూచించారు. నేరస్తుల షీట్ ఓపెనింగ్ కోసం ప్రపోజల్స్ పంపాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యూలు త్వరగా ఎగ్జిక్యూట్ అయ్యేలా ప్రత్యేక టీం ఏర్పాటు చేయాలని తెలిపారు. సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

అనంతరం విలేకరులతో మాట్లాడారు. అత్యాశకు పోయి అనవసరపు లింకులు ఓపెన్ చేయొద్దని ప్రజలకు సూచించారు. సైబర్ నేరాల బారినపడినవారు 1930 లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలన్నారు. డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసు శాఖ తరఫున ప్రత్యేక చొరవ చూపుతామని, ఎవరైనా గంజాయి పండించినా, విక్రయించినా 8712656777 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అదే విధంగా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించి రికార్డులు పరిశీలించారు. సీఐ ప్రవీణ్‌రెడ్డి తోపాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

జనసంద్రమైన టేకూర్

- భక్తిశ్రద్ధలతో మొహర్రం


దర్గాను దర్శించుకునేందుకు బారులుదీరిన ప్రజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని టేకూర్ గ్రామం జనసంద్రంగా మారింది. మొహర్రం పండగను పురస్కరించుకొని గురువారం వివిధ ప్రాంతాల నుంచి జనం వేలాదిగా తరలివచ్చారు. రెండు రోజులు జరిగే ఈ ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు ఉదయం నుంచే ప్రజలు దూదిపీర్లతో తరలివచ్చారు. గ్రామం సమీపంలోని గుట్టపై గుహలో ఉన్న మైబుసుభాని దర్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నబీసాబ్ సమాధిని దర్శించుకున్నారు. గ్రామ ప్రధాన కూడలిలోని ఆషుర్ఖానా వద్ద దూది పీర్లను ఉంచి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, మాజీ మంత్రి చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, హుగ్గెల్లి రాములు, తిరుపతిరెడ్డి, గిరిధర్‌రెడ్డి, సిద్దిలింగయ్యస్వామి, శుక్లవర్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు.


ఆషుర్ఖానా వద్ద ప్రతిష్ఠించిన పీర్లు

ఆర్థిక పరిపుష్టికి 'మహిళా శక్తి'


మాట్లాడుతున్న జయశ్రీరాజ్

నారాయణఖేడ్: మహిళల ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహిళా శక్తి' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజరు జయశ్రీరాజ్ అన్నారు. మనూరులో మండల సమాఖ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. పాడి గేదెలు, ఆవులు, మీసేవ కేంద్రాలు, క్యాంటీన్‌లు, చేపల వ్యాపారం, పెరటి కోళ్ల, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా, శ్రీనిధి ద్వారా రుణాలు ఇప్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వంశీకృష్ణ, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ స్వామి, సీసీలు సంగయ్య, రాములు, నాగమణి, ఆపరేటర్ సంజీవ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే



భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని గురువారం పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఫ్యాషన్ డిజైన్‌తో ఉపాధి



మాట్లాడుతున్న రామారావు

హుస్నాబాద్‌రూరల్: మహిళలు కుట్టు శిక్షణతో పాటు ఫ్యాషన్ డిజైన్‌ను నేర్చుకొని ఉపాధి పొందాలని జన వికాస స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రామారావు అన్నారు. గురువారం హుస్నాబాద్‌లో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ డిజైన్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడానికి ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన మహిళలు టైలరింగ్‌తో స్వయం ఉపాధి పొంది ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. మగ్గం వర్కు, అల్లికలు లాంటి స్కిల్స్ నేర్చుకుంటే ఫ్యాషన్ డిజన్ డ్రెస్‌లను కూడా కుట్టొచ్చన్నారు. మహిళలకు శిక్షణ ఇవ్వడంతోపాటు మధ్యాహ్న భోజన వసతి కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జన వికాస ప్రతినిధులు స్పత్, న్యాయవాది రాజమౌళి, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

సంగారెడ్డి : పాఠశాలల్లో ఫేర్వెల్ పార్టీలు నిర్వహించొద్దని డీఈఓ సర్క్యులర్‌కు నిరసనగా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. అనాదిగా కొనసాగుతున్న కార్యక్రమాన్ని నిర్వహించొద్దని నిబంధన విధించడం సరైనది కాదని పేర్కొన్నారు. అనంతరం డీఈఓ వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు

– డీఎస్పీ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్: విద్యార్థులు మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని డీఎస్పీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అల్లాపూర్ బాలుర గురుకుల పాఠశాలలో ఆర్డీఓ జయచంద్రారెడ్డితో కలిసి డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువులపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఇదిలా ఉంటే రెండు రోజుల కిందట సీనియర్, జూనియర్ విద్యార్థులు పరస్పర ఘర్షణకు పడిన విషయం తెలిసిందే. ఇందుకు విద్యార్థులు సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఎస్‌ఐ సుభాష్, ప్రిన్సిపాల్ మురళీ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీపై విచారణ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో రెండు రోజుల కిందట జరిగిన హుండీ లెక్కింపులో బంగారు ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి యత్నించిన ఘటనకు సంబంధించి గురువారం ఎస్‌ఐ రాజు ఆలయంలో విచారణ ప్రారంభించారు. ఘటన జరిగిన ప్రదేశంలో ఉన్న ఓ ఆలయ అర్చకుడిని విచారించారు. అదే సమయంలో కార్యాలయ సిబ్బందిని విచారించేందుకు కార్యాలయంలోకి వెళ్లగా ఈవో, ఏఈవోలు, సిబ్బంది లేకపోవడంతో ఆలయ పూజారిని మాత్రమే విచారించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆమెకు బీమా.. ధీమా

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గాను ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నాయి. ఇప్పటి వరకు వ్యాపార నిర్వహణ, ఉపాధికల్పన, వాహనాల కొనుగోలు, ఆహారపదార్థాల ఉత్పత్తి, వ్యవసాయం వంటి వాటి రూపంలో మహిళలకు ఆర్థికంగా ప్రభుత్వం తోడ్పాటును అందించింది. నూతనంగా ప్రవేశపెడుతున్న బీమా పథకంలో సాధారణ మరణాలు, ప్రమాద మరణాలను ఆధారంగా చేసుకొని రుణ బీమా, ప్రమాద బీమా పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళా సంఘంలో ఉన్న మహిళలు ఇకపై ఎలా మరణించినా ప్రభుత్వం నుంచి బీమా సొమ్ము అందిస్తారు. ఈ బీమాకు సంబంధించి అన్ని రకాల గైడ్‌లైన్స్ అధికారులకు అందాయి.

– సిద్దిపేటరూరల్



మహిళా సంఘం సభ్యుల సమావేశం

- మహిళా సంఘాల సభ్యులకు రెండు రకాల బీమా సౌకర్యం
- ఎలా మరణించినా అందేలా ఉత్తర్వులు
- రుణాలు మాఫీ, రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తింపు
- జిల్లాలోని 1,93,583 మందికి లబ్ధి

జిల్లా వ్యాప్తంగా ఒక జిల్లా సమాఖ్య, 25 మండల సమాఖ్యలకు గాను మొత్తం 18,266 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో ఒక్కో మహిళా సంఘానికి 10 నుంచి 15 మంది చొప్పున సభ్యులు ఉండగా మొత్తం 1,93,583 మంది ఉన్నారు. ఈ మేరకు ప్రభుత్వం తీసుకొచ్చిన రెండు రకాల బీమా పథకాలకు వీరంతా అర్హులుకానున్నారు. మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న ప్రతీ మహిళకు రుణంతో సంబంధం లేకుండా బీమాను వర్తింపజేస్తూ నూతనంగా ఈ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది.

60 ఏళ్లలోపు మహిళలందరికీ..

మహిళా సంఘ సభ్యులకు ప్రభుత్వం రుణ బీమా, ప్రమాద బీమా పథకాలను అమల్లోకి తీసుకొచ్చింది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాలను 60 ఏళ్ల లోపు వయస్సు ఉన్న మహిళా సంఘం సభ్యులందరూ అర్హులు. వయస్సుకు సంబంధించిన కటాఫ్ తేదీని మార్చి 14, 2024గా ప్రకటించింది.

రూ.2 లక్షల వరకు రుణమాఫీ..

రుణ బీమా పథకంలో భాగంగా మహిళా సంఘం సభ్యురాలు రుణం తీసుకున్న తర్వాత ఏ కారణంతోనైనా చనిపోతే తీసుకున్న రూ.2 లక్షల రుణం మాఫీ కానుంది. ఒక వేళ చనిపోయిన మహిళ బ్యాంకు లింకేజీ రుణంతోపాటుగా స్త్రీనిధి రుణం కూడా తీసుకుంటే వాటిలో ఒక్క లోన్ మాత్రమే మాఫీ కానుంది. గతంలో మహిళా సభ్యురాలు మరణిస్తే మృతురాలు తీసుకున్న రుణం కుటుంబ సభ్యులు చెల్లించేందుకు ముందుకు రాకపోయేది. దీంతో గ్రూపు మొత్తం సభ్యులపై ఈ భారం పడింది. మరణించిన మహిళ వాటా తీసేసి బ్యాంకులో రుణం చెల్లిస్తే బ్యాంకర్లు తీసుకోకపోవడంతో పాటుగా వారి గ్రూపును ఎన్‌పీఏ జాబితాలో వేసేవారు. కానీ ప్రస్తుతం ఈ పథకాల ద్వారా అలాంటి ఇబ్బందులను నివారించేందుకు వీలుంది.

మహిళలకు ఎంతో మేలు..



ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన రెండు రకాల బీమా పథకాలతో మహిళలకు ఎంతో మేలు జరగనుంది. ప్రస్తుత రోజుల్లో బీమా అందరికీ అవసరమని, మహిళల కోసం ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఈ బీమా పథకాలకు సంబంధించిన పూర్తి ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుంది. మహిళలు సాధారణ, ప్రమాద మరణాలు, అంగవైకల్యం జరిగినా సంబంధిత అధికారుల ధ్రువీకరణల మేరకు వారికి లబ్ధి చేకూరనుంది.

జయదేవ్ ఆర్యా,
జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

ప్రమాదబీమా రూ.10 లక్షలు..

మహిళా సంఘంలో సభ్యురాలుగా నమోదైన ప్రతీ మహిళకు ప్రమాదబీమా సౌకర్యం వర్తించనుంది. ప్రమాదవశాత్తు ఎవరైనా సభ్యురాలు చనిపోతే ప్రమాదబీమా పథకం కింద రూ. 10 లక్షలు మృతురాలి కుటుంబ సభ్యులకు అందిస్తారు. ఆ సభ్యురాలి వయస్సు తెలిపే ఆధార్, ఓటర్ ఐడీ, ఏదో ఒక గుర్తింపు కార్డుతో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. కానీ ప్రమాదవశాత్తు చనిపోతే పోలీస్ ఎఫ్ఐఆర్ కాపీ, మెడికల్ ధ్రువీకరణ పత్రాలు, గ్రామ సంఘం ట్యాబ్ ద్వారా గాని, సెర్ప్, మెప్మా సిబ్బంది ద్వారా ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ఒక వేళ ఏదైనా అంగవైకల్యం జరిగితే రూ.5 లక్షల పరిహారం అందించనున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గతంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆమ్ ఆద్మీ బీమా, అభయహస్తం పథకాలను రద్దు చేయడంతో ఈ పరిహారానికి మహిళలు దూరమయ్యారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రుణ బీమాను అమలు చేయడం ప్రయోజనకరమని మహిళలు అభిప్రాయపడుతున్నారు.

రైతుల ఆనందమే ప్రభుత్వానికి ఆశీర్వాదం

మంత్రి దామోదర రాజనర్సింహా



మంత్రి దామోదరను సన్మానిస్తున్న నాయకులు,రైతులు

సంగారెడ్డి : రైతుల ఆనందమే ప్రభుత్వానికి ఆశీర్వాదం అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఉమ్మడి పుల్కల్ మండల పరిధిలోని గొంగ్లూర్ గ్రామంలో రుణమాఫీ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మండలాన్ని ఎంతో అభివృద్ధి పథంలో నడపడానికి కృషి చేస్తున్నానని రైతుల కోసం రూ.160 కోట్లతో సీసీ నిర్మాణం పనులు త్వరలో చేపడుతామన్నారు. పుల్కల్ మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రిని త్వరలో ప్రారంభిస్తామన్నారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు సాధ్యమైనంత వరకు త్వరలోనే ప్రజలకు అందే విధంగా చేస్తుందన్నారు. సింగూర్ ప్రాజెక్టు వద్ద టూరిజం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రామచందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్, అంజయ్య, బోయిని శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ దుర్గయ్య, మాజీ సర్పంచ్ యాదగిరి, సురేందర్ గౌడ్, బాలరాజ్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఇమ్రాన్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, సీడీఆర్ యువసేన అధ్యక్షుడు విక్రం, గణపతి, యాదయ్య, సాజిద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

కొల్చారం(నర్సాపూర్): చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పైతర గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన తాటి మల్లేశం(52) రాత్రి మొహర్రం వేడుకల్లో పాల్గొన్నాడు. కాలు కడుక్కునేందుకు చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు జారి చెరువులో మునిగిపోయాడు. ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా చెరువు గట్టు వద్ద మల్లేశం ధోతి కనిపించింది. చెరువులోకి దిగి మల్లేశం కోసం వెతకగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

గజ్వేల్‌రూరల్: మహిళ అదృశ్యమైన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(వేములఘట్)లో తాత్కాలికంగా కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివాసముంటున్న కుంట విజయలక్ష్మీ ఈ నెల 13న ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. గతంలో సైతం ఇదే విధంగా వెళ్లిన విజయలక్ష్మీ రెండ్రోజుల తర్వాత ఇంటికొచ్చింది. ఈసారి కూడా వస్తుందనకుంటే రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. గురువారం బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయపోలు మండలం వీరారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. రాయపోలు ఎస్సై రఘుపతి కథనం మేరకు.. వీరారెడ్డిపల్లికి చెందిన వేముల శ్రీనివాస్ (46) నలుగురు అన్నాదమ్ముళ్లు. వారికి తమ తండ్రి రాజయ్య తలా 20 గుంటల వ్యవసాయ భూమితోపాటు ఇంటి స్థలాలను వాటాగా చేసి పంచాడు. వీటి విషయంలో అన్నాదమ్ముళ్ల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దలు చెప్పినా పంచాయితీలు పరిష్కారం కాలేదు. దీంతోపాటు కుటుంబ పోషణకు చేసిన అప్పుల వారి వేధింపులు ఎక్కువ అయ్యాయి. జీవితంపై విరక్తి చెందిన శ్రీనివాస్ ఈ నెల 17న కుటుంబ సభ్యులు నిద్రించిన తర్వాత బయటకు వెళ్లి తన సోదరుడు నిర్మించుకుంటున్న ఇంటి పిల్లర్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం నిద్రలేచిన కుటుంబ సభ్యులు విషయాన్ని గమనించి కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

యాసిడ్ తాగి కంసాలి..

తూప్రాన్: యాసిడ్ తాగి కంసాలి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. పట్టణానికి చెందిన రాయరపు నర్సింహ్మాచారి (35) కంసాలి దుకాణం కొనసాగిస్తున్నాడు. నాలుగేళ్ల కిందట నూతనంగా ఇంటి నిర్మాణం కోసం బ్యాంకుల్లో రూ.17 లక్షలు, స్నేహితుల వద్ద మరికొంత అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక మనస్తాపంతో దుకాణంలోని యాసిడ్ తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. చుట్టు పక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి చనిపోయాడు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో హోటల్ కూలీ..

సిద్దిపేటకమాన్: అప్పుల బాధతో హోటల్ కూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన యాదగిరిగౌడ్ (52) పట్టణంలోని భరత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. పట్టణంలోని ఓ హోటల్‌లో రోజు కూలీగా పనిచేస్తూ కుటుంబంతో జీవనం కొనసాగిస్తున్నాడు. చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఉరి చేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి గుంతలో పడి డ్రైవర్ గల్లంతు

పటాన్‌చెరు టౌన్: క్వారీ నీటి గుంతలో పడి ట్రాక్టర్ డ్రైవర్ గల్లంతైన ఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మెదక్ జిల్లా తిమ్మాపూర్‌కు చెందిన నర్సింహులు (38) బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలో ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గ్రామ పరిధిలో మూతబడిన క్వారీలో వడ్డెర్లు కొట్టిన రాయిని ట్రాక్టర్‌లో రవాణా చేస్తున్నారు. గురువారం డ్రైవర్‌గా ఉన్న నర్సింహులు ట్రాక్టర్ నడుపుతూ ప్రమాదవశాత్తు 20 అడుగుల ఎత్తు నుంచి క్వారీ నీటి గుంతలో వాహనంతో సహా పడిపోయాడు. డ్రైవర్ గల్లంతు కాగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి

మునిపల్లి(అందోల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్‌ఐ ఎసయ్య గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన బేగ్ పరహాన్(14) కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో 17వ తేదీన న్యాల్‌కల్ మండలం చెనిగేపల్లి గ్రామానికి పీర్ల పండుగకు వెళ్తున్నారు. మునిపల్లి మండలం కంకోల్ నుంచి వెళ్లాల్సి ఉండగా దారి తప్పి బుదేరా నుంచి వెళ్తున్న క్రమంలో పొల్కంపల్లి గ్రామ శివారులో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బేగ్ పరహాన్ తీవ్ర గాయాలు కాగా మరికొందరికి స్వల్ప గాయాలు అయ్యాయి. పరహాన్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలిచగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

వందకు పైగా చెట్లు నరికివేత

ఓ పరిశ్రమ విద్యుత్ లైన్ కోసం కొట్టేసిన వైనం



రోడ్డుకు ఇరువైపులా నరికివేసిన చెట్లు

చిన్నశంకరంపేట(మెదక్): హరితహారం కార్యక్రమంలో భాగంగా సూరారం రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలు పెరిగి పెద్దవి అయ్యాయి. ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతున్న వేల ఓ పరిశ్రమకు విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం వందలాది చెట్లను నరికి వేసిన ఘటన చిన్నశంకరంపేట మండలంలోని సూరారం వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చిన్నశంకరంపేట నుంచి సూరారం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు గతంలో మొక్కలు నాటారు. ఓ పరిశ్రమకు సంబంధించి విద్యుత్ లైన్ కోసం సుమారు రెండు కిలోమీటర్ల పొడువును అడ్డుగా ఉన్న చెట్లను నరకడంతో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై ట్రాన్స్‌కో ఏఈ సతీష్‌బాబును ప్రశ్నించగా చెట్ల నరికిన విషయం తమకు తెలియదన్నారు. పరిశ్రమకు సంబంధించిన కాంట్రాక్టర్ చెట్లను నరికివేశారని, ఈ విషయంలో తమను సంప్రదించలేదని తెలిపారు.

కొమురవెల్లి ఏఈవోను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న రాజారామ్

కొమురవెల్లి(సిద్దిపేట) : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు సమయంలో దొంగతనానికి యత్నించిన ఏఈవోను సస్పెండ్ చేయాలని విశ్వహిందూ పరిషత్ మెదక్ విభాగ్ సహ కార్యదర్శి గ్యాదరి రాజరామ్ డిమాండ్ చేశారు. గురువారం కొమురవెల్లి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల కిందట ఆలయంలో హుండీ లెక్కింపు జరిగిందని ఆ సమయంలో అక్కడ ఉన్న ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్, కొంత మంది ఆలయ సిబ్బంది అక్కడే ఉండి దొంగతనానికి యత్నించారని ఆరోపించారు. హుండీ లెక్కింపు జరిగే ప్రదేశంలో సీసీ కెమెరాలు పని చేయడం లేదంటే అధికారుల పనితీరుపై అనుమానంగా ఉందన్నారు. ఆలయంలో దొంగతనానికి యత్నించిన ఏఈవో గంగా శ్రీనివాస్‌తో పాటు సిబ్బందిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బుస నరేశ్, జిల్లా సంయోజక్ ఎక్కలదేవి శ్రీనివాస్, భరత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కాలు, గంజాయి పట్టివేత

బీదర్ నుంచి ఖమ్మం తరలింపు



గుట్కాలతో పోలీసులు



గుట్కా వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

జహీరాబాద్: అక్రమంగా తరలిస్తున్న గుట్కాను జహీరాబాద్ ప్రాంతంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని చిన్ని సత్యనారాయణకు చెందిన కిరాణా దుకాణంపై పోలీసులు దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ.లక్ష విలువగల నిషేధిత గుట్కా, తంబాకును, పాన్ మసాలాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అలాగే, కర్ణాటకలోని బీదర్ నుంచి ఖమ్మం జిల్లాకు టాటా ఏస్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గుట్కాను నమ్మదగిన సమాచారం మేరకు జహీరాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో పట్టుకున్నారు. పట్టుబడిన వాటి విలువ రూ.11,50,149 ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన మహ్మద్ అఫ్సర్ గుట్కాను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు

నారాయణఖేడ్: అక్రమంగా నిల్వ ఉంచిన నిషేధిత గుట్కాలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డి కథనం మేరకు.. నారాయణఖేడ్ పట్టణంలోని వెంకటేశ్వర సినిమా థియేటర్ పక్కన గల పాత ఇంట్లో గుట్కా పొకెట్లు ఉన్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు సంగారెడ్డి సీసీఎస్ పోలీసులు దాడి చేసి రూ.4,53,748 విలువ గల గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నారు. పట్టణానికి చెందిన నిందితుడు వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఎయిర్ ఫోర్స్‌తో గీతం ఒప్పందం




ఒప్పంద పత్రాలు చూపుతున్న అధికారులు

పటాన్‌చెరు: భారతీయ వైమానిక దళంతో గీతం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అర్హులైన విద్యార్థులకు రాయితీ పై సీట్లు, పరిశోధనల్లో గీతంకు చేయూత ఇచ్చేందుకు వైమానిక దళం ఒప్పుకుంది. భారతీయ వైమానిక దళం (ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఐఏఎఫ్)లో పనిచేసే వారి పిల్లల విద్యకు మద్దతుగా గురువారం భారత వాయుసేనతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఐదేళ్లపాటు అమలులో ఉండే ఈ ఒప్పందం ప్రకారం, అర్హులైన విద్యార్థుల విద్యకు వివిధ రాయితీలను గీతం కల్పించడంతోపాటు గీతం చేపట్టే పరిశోధనలకు ఐఏఎఫ్ సహాయ సహకారాలను అందించనుంది. అవగాహనా ఒప్పందంపై ఎయిర్ వైస్ మార్షల్ రాజీవ్ శర్మ, గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి. ప్రొఫెసర్ డీ.ఎస్.రావు సంతకాలు చేయగా, దాదాపు 25 మంది అధికారులతో కూడిన ఐఏఎఫ్ బృందం, సలువురు అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

దత్తాచల క్షేత్రంలో గురు పౌర్ణమి ప్రత్యేక పూజలు

- 19 నుంచి 21 వరకు నిర్వహణ
- 600 ఏళ్ల చరిత్ర గల పుణ్యక్షేత్రం




దత్తాచల క్షేత్రంలోని ఆలయం

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని హత్నూర మధుర గ్రామాల శివారులోని గుట్టల్లో వెలిసిన దత్తాచల క్షేత్రం(దత్తయ్య గుట్ట) 600 ఏళ్లకు పైబడిన చరిత్ర ఉంది. మానవులను సన్మార్గంలో నడిపించి ధర్మాలను బోధించడానికి 12వ శతాబ్దంలో శ్రీపాద శ్రీవల్లభ వారిగా, 15వ శతాబ్దంలో నృసింహ సరస్వతి స్వామి వారిగా అవతరించారు. దత్తాచల క్షేత్రంలోని గుట్టలో ఓ పెద్ద రాతి బండపై దత్తాత్రేయ స్వామివారి పాదుకలు ఉన్నాయి. ఈ పాదుకలను దత్తాత్రేయ స్వామి బదులుగా భక్తులు మొక్కుతూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. కొన్నేళ్ల నుంచి బ్రహ్మోత్సవాలను ఈ క్షేత్రంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. దత్త జయంతి, గురు పౌర్ణమి, వసంత పంచమి, ప్రతీ గురువారం ప్రత్యేక పూజలు వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దత్తాచల క్షేత్రంలో స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ తరిస్తున్నారు.

నేటి నుంచి మూడు రోజులపాటు..

గురు పౌర్ణమి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నట్లు దేవి ఉపాసకులు సభాపతి శర్మ తెలిపారు. పౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా 21వ తేదీ వరకు గణపతి పూజ, శాంతి మంత్రాలు, గోపూజ, పుణ్యాహవచనంతోపాటు పలు రకాల హోమాలు, యజ్ఞాలు, 21న మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 19 శుక్రవారం ఉదయం గణపతి పూజ, నవగ్రహ దోష నక్షత్ర దోష ప్రత్యేక పూజలు రుద్రహోమము దత్తాత్రేయ మూల మంత్రము. 20వ తేదీ శనివారము ఉదయం 8 గంటలకు నుంచి 10 గంటల వరకు సమస్త వ్యాధి భయాలు తొలగించు సంపూర్ణ ఆరోగ్యం కోసం వరుణ పారాయణం, సాయంత్రం మహా మంగళ హారతి పుష్పార్చన ప్రత్యేక పూజలు, 21 ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా ఉదయం ఐదు గంటలకు దత్తాత్రేయ స్వామి స్వయంభు మూలవిరాట్ కు మహాన్యాస పూర్వక పంచామృత అభిషేకములు, చండీ పారాయణము గురు కటాక్షము దత్త హోమము పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తి గిరి ప్రదక్షిణ ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందని క్షేత్రాధిపతి సభాపతి శర్మ తెలిపారు. మూడు రోజులపాటు జరిగే గురు పౌర్ణమి బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

దాతల సహకారంతో ఆలయ నిర్మాణం



కొలువుదీరిన దత్తాత్రేయ స్వామి

దత్తా చల క్షేత్రం గుహలో ఉన్న దత్తాత్రేయ స్వామి వారిని కొంతమంది దాతలు ముందుకు రావడంతో ఐదేళ్ల నుంచి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు క్షేత్రాధిపతి, శ్రీచక్ర ఉపాసకులు, సభాపతి శర్మ తెలిపారు. గుహలో ఉన్న స్వామి వారిని భక్తులు దర్శించుకునేందుకు ఇబ్బందిగా ఉన్నందున గుహలోని కొన్ని బండరాళ్లను తొలగించడంతో స్వామివారి పూర్తిస్థాయి నిజరూపం భక్తులు చూడగలుగుతున్నానని తెలిపారు. నూతనంగా గుహపై ఆలయాన్ని నిర్మించడానికి పూనుకొని ఇప్పటికీ 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. మరి కొంతమంది దాతలు ముందుకొస్తే పూర్తి స్థాయిలో నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు.